26069601

క్షమ సత్యము క్షమ ధర్మము
క్షమ యోగము క్షమ అహింస క్షమ యజ్ఞమగున్
క్షమ ఆచారము క్షమ దయ
క్షమయె ఆధారమగును సర్వంబునకున్.

విద్యార్థులారా!

మానవుడు సాధించవలసినది ప్రప్రథమములో ప్రధానమైనది క్షమ. ఈ పవిత్రమైన క్షమ గ్రంథముల చేత తెలుసుకొనేది కాదు. అధ్యాపకుల చేత బోధింప బడేది కాదు. మిత్రుల చేత అందుకోబడేది కాదు. లేక మార్కెట్టులో కొనేది కాదు. కంపెనీ సృష్టి చేసేది కాదు. నిత్యజీవితములో సత్యమైన మార్గమున ప్రవేశించి అభ్యాసరీతిగా పొందవలసినదే గాని మరొక రీతిగా లభ్యమయ్యేది కాదు. నిత్యజీవితములో సత్యమార్గమును అనుసరించి ధర్మమార్గము చేత పొందవలసినదే ఈ క్షమ. ఈ క్షమ మానవునికి ఒక భద్రమైన కవచము. ఎన్ని కష్టములు సంభవించినా, ఎన్ని బాధలు సంభవించినా, ఎన్ని దుఃఖములు ప్రాప్తించినా మనము దీనికి లొంగక పొంగక కృంగక ఈ క్షమ అనే కవచము ధరించి తద్వారా మనము తట్టుకొని నెట్టుకొని ముందుకు పోగాలి. క్షమ యొక్క శక్తి మరొక దానికి లేదు. ఇది మానవుని ప్రధానమైన విలువ. ఈ మానవతా విలువైన క్షమను ఈనాడు మానవుడు విస్మరించి కేవలము భౌతికమైన, లౌకికమైన వృత్తిలో పొల్గొని తన మానవతా విలువను తాను కోల్పోతున్నాడు. కాని మానవుడు ఈనాడు నిత్యజీవితములో అనుభవించే కష్టసుఖములకు తాను లొంగిపోయి ఈ క్షమను కోల్పోతున్నాడు.

జీవితము చాలా విలువైనది. జీవితము చాలా సుదీర్ఘమైన ప్రయాణము. జీవితము జీవించవలసినది. జీవితము చాలా పవిత్రమైనది. ఇట్టి పవిత్రమైన జీవితములో దివ్యమైన మార్గము అవలంబించటానికి క్షమ ఎంతైనా అవసరము. కొన్ని కష్టములందే ఈ క్షమ అభివృద్ధి గాంచుతుంది. కష్టములు లేక క్షమను పెంచుకోటానికి వీలుకాదు. The pleasure is an interval between two pains. ఇవి. కష్టములు మానవుని విలువలు గుర్తింపచేసేవి. దుఃఖములు మానవుని మానవత్వము ప్రకటింపచేసేవి. పంచ పాండవులు కష్టములందే తమ క్షమను కాపాడుకోగలిగారు. కనుక కష్టములు సుఖములనందించే సోపానములే. అయితే ఈ క్షమను కూడా సమయస్ఫూర్తిగా మనం వినియోగించుకోవాలి. ఏ సమయమందు ఎవరికి ఏ విధంగా ఈ క్షమను ఉపయోగించాలనే విధి విధానము మనము

26069602

సహించాలి. మహమ్మద్ ఘోరీ పృథ్వీరాజ్ పై పదిహేడు పర్యాయములు దండెత్తి వచ్చాడు. కానీ ఈ పదిహేడు పర్యాయములు ఘోరీ అపజయమునే పొందాడు. విశాలహృదయుడు, పవిత్ర భావములు కలిగినవాడు పృథ్వీరాజు. క్షమ అతని స్వభావము. ఈ పదిహేడు పర్యాయములు తన చేత చిక్కుబడినప్పటికిని క్షమించి అతనిని వదలిపెట్టాడు. కాని ఘోరీ దీనికి కృతజ్ఞత చెల్లించక కృతఘ్నుడుగా మారిపోయాడు. మానవునకు అకృతజ్ఞత అనేది తెలియదు. స్వార్థము స్వప్రయోజనములలో మునగటం చేత మానవత్వము ఇన్ని విధములైన చిక్కులకు గురికావలసి వచ్చింది. ఈ స్వార్థమునకు ఒక పరిమితము ఉండాలి. స్వప్రయోజనమునకు ఒక పరిమితముండాలి. కాని ఘోరీ ఈ విధమైన క్షమ గుర్తించుకోలేక పోయాడు. జయచంద్రుని సహవాసము చేత తిరిగి పృథ్వీరాజ్ పై దండెత్తి వచ్చి పృథ్వీరాజును జయించాడు. కాని పదిహేడు పర్యాయములు క్షమించిన పృథ్వీరాజునకు కృతజ్ఞత చూపక పృథ్వీరాజు యొక్క కన్నులను తీయించాడు. చూశారా! ఈ క్షమను క్రూరుని వద్ద కొంత పరిమితము పెట్టుకోవాలి. క్షమ మంచిదేగాని మితిమీరినటువంటి వ్యక్తుల దగ్గర ఈ క్షమ ఏమాత్రము ఉపకారము చేయదు.

సకల విద్యలు నేర్చి సభ జయించగవచ్చు
　　శూరుడై రణమందు పోరవచ్చు
రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు
　　హేమ గోదానము లీయవచ్చు
గగనమందున చుక్కలు లెక్కగొనవచ్చు
　　జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
కాని దేహేంద్రియాదుల నరికట్టి
మనసు నిల్పియు నంతర్ముఖము చేసి
అనవరతము నిశ్చలమైన చిత్తశుద్ధి
నిలుపగా లేరు మానవుల్ నియతి తోడ

ఇంద్రియ నిగ్రహము అత్యవసరము. దైవార్పిత భావము చేత ఈ క్షమను మనం అభివృద్ధి గావించుకోవచ్చు దైవార్పిత భావము లేక, దైవానుగ్రహము లేక, దైవ ప్రీతి లేక ఈ క్షమా గుణము మనము అభివృద్ధి పరచుకోలేము.

క్షమయే దైవము. సత్యమే దైవము. ప్రేమయే దైవము. ప్రేమ తత్త్వము పొందినప్పుడు

సత్యము క్షమ మనస్వాభావమై పోయాయి. సక్కూబాయి పండరి పురములో రాత్రింబవలు రంగా రంగా యని విచారిస్తూ తన లక్ష్యమును తన దృష్టిని రంగనిపై ఉంచి అనేక కష్టములకు గురికావలసి వచ్చింది. పెళ్లి నాటి మొదలు రాత్రి పరుండినంతవరకు అత్త భర్తల చేత అనేక బాధలు అనుభవిస్తూ వచ్చింది. కానీ ఈ క్షమయే ఆమెకు బలము నందిస్తూ వచ్చింది. ఈ క్షమా గుణము శాంతిని దర్శనము కలుగ చేసింది. ఆమెను హింసించాలని అనేక కఠినమైన పనులు అందిస్తూ వచ్చారు. ఏమి చేసినా దైవార్పిత భావముతో చేస్తూ వచ్చింది. సర్వము భగవత్ప్రీత్యర్థముగా భావిస్తూ వచ్చింది.

నిలువ నీడ లేని బ్రతుకు నీకొరకని మోయుదాన రంగా
నిలువదురా నమనసు నీచూపులు దూరమైన
కలలోనైన కనులకు గానరావా కృష్ణా।
నిన్ను విడచి నే నిలువలేరా కానగరావా।
వేద సారమంత తీసి నాదబ్రహ్మముగను మార్చి
వేణువందు తిరగబోసి గానరూపముగను మార్చి ॥పాట
పాట పాడుమా కృష్ణా పలుకు తేనె లొలుకు నటుల
మాట లాడుమా ముకుంద మనసు తీరగా ॥

పాడుతూ బస్తాడు బియ్యము విసిరి విసిరి అలసి పోయింది. యద్భావం తద్భవతి. ఎట్టి భావమో అట్టి ఫలితము ఎట్టి భావమో అట్టి గుణము. ఎట్టి కర్మయో అట్టి ఫలము. భగవద్విషయములో పల భయమునకు తావుండదు ఈ విధమైన ధైర్యము చేత క్షమను పెంచుకోవాలి. కష్టకడపటికి భక్తపరాధీనుడైన భగవంతుడు సక్కుబాయిని ఆనందింప చేయ నిశ్చితమై రంగడే సక్కుబాయి వేషము ధరించి ఇంటిలో నింటి పనులు చేస్తూ సక్కుబాయిని పండరిపురం పంపించాడు. పాడింది ఒకకృతిని.

ఎంతకాలము బాధలు రంగా ఎందుకోసమ గాథల
న్యాయము లేదా నీలో వాదా నాపై కరుణయిలేదా
నీ దాసిని నే కానా కాదా నీచ పరచ మర్యాదా।

నిజముగా నేను నీ దాసురాలైతే నాకెందుకీ బాధలు. నాలో ఏదో దోషముంది. నాలో ఏదో లోపం ఉన్నది. కనుకనే నీవింత అలక్ష్యము చూపుతున్నావు. నా దోషము తెలిపి నా దోషము నిర్మూలనం చేయి. తక్షణం పాండురంగడు ప్రత్యక్షమై పాండురంగడే సక్కుబాయిలో చేరాడు. జగత్తంతా బ్రహ్మమయము. అందరూ బ్రహ్మ

స్వరూపులే. అందరు దైవాకారులే. తాను సక్కుబాయిలో ప్రవేశించి సక్కుబాయిని పండరిపురం పంపి తాను ఇంటిలో కాపురము చేస్తూ వచ్చాడు సక్కుబాయి వలె.

దైవము ఎక్కడ చూచినా ఉంటున్నాడు.

ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రిసర్వోపగతుం
డెందెందు వెదకి జూచిన
నందందే గలడు ....

నీ హృదయము పరిశుద్ధము కావాలి గాని దైవదర్శనము కష్టము కాదు. దైవదర్శనము అంత సులభమైనది. కాని నీ హృదయ మాలిన్యము చేత దైవత్వాన్ని నీవు పొందలేక పోతున్నావు. ప్రకాశముగా నున్న సూర్యుని చూడాలంటే కన్నులు తెరవాలి. సూర్యుడు ప్రకాశిస్తున్నప్పటికిని ఏరీతిగా కనిపిస్తాడు. మన హృదయనేత్రము పరిశుద్ధముగా ఉండాలి. పవిత్రముగా ఉండాలి. అప్పుడే దైవత్వము ఎక్కడ చూచినా సాక్షాత్కరిస్తుంది. ఎక్కడ చూచినా హరి పాదములలో ఉంటున్నాడు. కాని మానవుని మనస్సు దట్టమైన మాలిన్యముతో కప్పబడి ఉంటున్నది. ప్రాకృత చింతలతో ఉంటున్నాది. భౌతిక వాంఛలతో పేరి ఉంటున్నాది. అస్థిరము అశాశ్వతము అయిన వాంఛలతో కూడి ఉంటున్నాది. కనుక నిత్యసత్యమైన దైవత్వమును దర్శించాలంటే హృదయము పరిశుద్ధము కావాలి. అద్దము మంచిదే ఈ అద్దములో నీ ప్రతిబింబము కనిపించదు. కారణం ఏమిటి? అద్దమునకు వెనుక భాగము పాదరసము పూసినప్పుడే నీ ప్రతిబింబము కనిపిస్తుంది. పాదరసము పూతలేక నీ ప్రతిబింబము కనిపించదు. ఆ పాదరసమే ప్రేమ. మన హృదయమనే అద్దమునకు పాదరసమనే ప్రేమ పూసినప్పుడే రెండవ వైపున సాక్షాత్కారము తక్షణమే లభ్యమువుతుంది. మానవుడు ఈనాడు ప్రేమరసమును పూయుటం లేదు. ద్వేషము, అసూయ, డంబము, ఆడంబరము ఇత్యాది దుర్గుణముల చేత నిండి ఉంటున్నాది హృదయము. దైవానుగ్రహము ఎంత కలిగినప్పటికిని దీని అర్థము తెలుసుకొనలేక స్వార్థము చేత మానవత్వాన్ని పూర్తి కోల్పోతున్నారు. తన భావమే తనకు ఆవిధంగా ప్రతిబింబిస్తున్నాది. అంతేగాని దైవమందు ఎట్టి మార్పులు ఉండవు. దైవము ఎప్పుడు నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్యశుద్ధబుద్ధ నిర్మలస్వరూపిణం! కాని మన భావములో ఆవిధముగా భ్రాంతి పడి పోతున్నాది.

గజరాజు ప్రార్థించాడు. నారాయణుడు రక్షించే నిమిత్తమై పోతున్నాడు. లక్ష్మికి

భయము వేసింది.

అడిగెదనని కడు వడి జను
అడిగిన తన మగడు డుగదని వెడ నుడుగున్

వెడవెడ సిడి ముడి తడ బడ
అడి గడుదు జడిమ అడిగిన ఎడలన్.

ముందుకు పోలేదు. వెనుకకు రాలేదు. అద్వైతము యొక్క ప్రభావము తనపై ప్రసరించింది. అర్థాంగి అయినా ఆడివ్యత్వము చేత ఒక దిగ్భ్రాంతి కలుగుతూ వచ్చింది. అడిగితే చెబుతాడో చెప్పడో అని సందేహము కలుగుతూ వచ్చింది. ఈ సందేహము ఎప్పుడు కలిగింది? దోషము ఉండినప్పుడే కలుగుతూ వచ్చింది. ఏ దోషము? నా దగ్గర నన్ను తప్పువు నాకు చెప్పకుండా వెళ్ళిపోతున్నాడే అనే అహంకారము ఇక్కడ మూల కారణము.

అహంకారము మహా చెడ్డది. ఈ అహంకారమే మానవుని అధఃపతనము గావిస్తుంది. ఈ అహంకారము అణగద్రొక్కితే దివ్యత్వమనే ప్రేమ తత్త్వము మనకు సాక్షాత్కరిస్తుంది. ఈ అహంకారము, ఆడంబరము, అసూయ ఇత్యాది దుర్గుణములు లేకుండా పోవాలంటే క్షమ మనకు సత్యం క్షమ మనకు యోగం. క్షమ మనకు దైవం. క్షమ మనకు సర్వస్వము. నీవు ఏ తపస్సు చేయనక్కరలేదు ఏ అడవులకు పోనక్కరలేదు. ఏ విధమైన సాధనలు చేయనక్కరలేదు. నిర్మలమైన ప్రేమ నీ హృదయము నుండి ఆవిర్భవించాలి. ఈనాటి ప్రేమలు కేవలము పలుకులలో మాత్రమే ఉచ్చరిస్తున్నారు గాని హృదయము నుండి ఆవిర్భవించటం లేదు. ప్రేమించినట్లుగా నటిస్తున్నారే గాని ప్రేమ యొక్క స్వరూపమును మరు గుర్తించటం లేదు. ప్రేమకు భయము లేదు. ప్రేమకు క్రోధము లేదు. ప్రేమకు ద్వేషము లేదు. ప్రేమ ఎప్పుడు పరిపూర్ణముగా నిర్మలముగా ఉంటుంది. భగవంతునిపై అనేక సందేహములు ప్రారంభమవుతూ ఉంటాయి. ప్రేమ లేని సమయమందే ఈ సందేహములు రావటం. నిజముగా ప్రేమ ఉంటే సందేహములుండవు. తమ సర్వస్వము భగవంతునికి అర్పిస్తుంటారు. భక్తులకు పరాధీనుడై ఉంటాడు భగవంతుడు. భక్తునికి మరొక పనే లేదు. దైవము యొక్క చింతనే భక్తునికి భక్తుని చింతనే భగవంతునకు. దాసునికి హితము బోధించటమే గురువు యొక్క లక్ష్యము. ఆజ్ఞను పరిపాలించటమే భక్తుని యొక్క పరమ లక్ష్యము. ఈ రెండింటిని విస్మరించి తనకు అవసరమై వచ్చినదానిని అనుసరిస్తున్నాడు ఈనాటి మానవుడు. ఇది సరైనది కాదు. ప్రేమ

26069606

ఎటువంటిది. ద్రౌపది యొక్క ఐదుగురు పుత్రులను చీకటిలో నిద్రించిన వారిని అశ్వత్థామ చంపుకొని వచ్చాడు. ఏమాత్రము తెలియని బిడ్డలు. కసికందులైన బిడ్డల గొంతు కోశాడు. కళ్ళుకడుపులకి అర్జునుడు అశ్వత్థామను పట్టుకు వచ్చాడు. ద్రౌపది దగ్గర పెట్టాడు. క్షమ ఎంతగొప్పదో చక్కగా వివరించండి.

పరగన్ మీ మగవారలందరును మున్ బాణప్రయోగోపసం
హారణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యులచే నభ్యసిం
చిరి పుత్రాకృతి నున్న ద్రోణుడవు నీ చిత్తంబులో శోకమున్
కరుణా సంఘము లేక శిష్యసుతులన్ ఖండింపగా పాడియే.

క్షమాగుణములో క్షమిస్తున్న ద్రౌపదిని చూచి భీమునికి కోపం వచ్చింది.

కొడుకుల పట్టి చంపెనను కోపము నొందదు బాలఘాతుకున్
విడువుమటంచు చెప్పెడిది వెఱ్ఱిది ద్రౌపది.
వీడు విప్రుడే విడువగనేల చంపుడు మరల వీని చంపరేని నా
పిడికిటి పోటునన్ శిరమున్ భిన్నము చేసెద చూడుడందరున్.

పోయి కాళ్ళ పట్టుకుంది ద్రౌపది.

వెఱచిన వాని దైన్యమున వేదన నొందువాని, నిద్రపై
మఱచిన వాని సౌఖ్యమున మద్యము త్రావిన వాని, భగ్నుడై
పఱచినవాని, సాధు జడ భావము వానిని, కావుమంచు వా
చఱచిన వాని కామినుల జంపుట ధర్మము కాదు అర్జునా.

ఇది న్యాయము కాదు. నా బిడ్డలు గతించిరని నేను ఎంత బాధ పడుతున్నానో ఈ అశ్వత్థామను నేను చంపితే ఈ అశ్వత్థామ తల్లి కూడా అంత బాధ పడుతుంది కదా. నా బిడ్డలు ఎట్లైనా చచ్చారు. దుఃఖము తప్పినది కాదు. ఇతనిని చంపి ఇతని తల్లికి ఎందుకు దుఃఖము నందించాలి? ఇది సరైన క్షమ. మన బాధలు ఎట్లా ఉంటాయో ఎదుటి వాని బాధలు అట్లా ఉంటాయనే సత్యమును మనం గుర్తించాలి. పుత్రుల యొక్క వియోగము చేత ఎంత బాధ పడుతున్నానో అశ్వత్థామ తల్లి ఆ పుత్రుని వియోగముచే బాధపడుతుంది. కనుక అశ్వత్థామను చంపకండి అని బోధించింది భీమార్జునులను. ఈ కాలములో ఏ తల్లి అయినా అంత క్షమను అంత ధర్మను కాపాడుకుంటుందా? ఆమెయే

ద్రౌపది. అగ్ని స్వరూపములో నున్నది ద్రౌపది. ఇంద్రియములను అదుపులో పెట్టి కాచునది ద్రౌపది. అలాంటి సతీమణులు భారత దేశమందు ఉద్భవించటం చేత ఈ భారత దేశము యొక్క సంస్కృతి అనేక రకములుగా ప్రకటిస్తూ వచ్చింది. అనాది కాలము నుండి.

ఎలాంటి కష్ట సమయమునందైనా ఓపిక పూని శాంతితో మన జీవితమును గడుపుటకు పూనుకోవాలి. అనాది కాలము నుండి క్షమ ప్రతి మానవుని గుండెగా నిల్చి ఉంది. శాంతి మహర్షుల సౌందర్యము. క్షమను కోల్పోవటం చేత అనేక సంవత్సరములు తపస్సు చేసిన మహర్షులు భ్రష్టులైపోయారు. రాజాధిరాజులు క్షమ లేక రాజ్యమును కోల్పోయారు. క్షమను కోల్పోవటం చేత పండితులు పతనమై పోతూ వచ్చారు. క్షమను సర్వరక్షగా మనం భావించాలి. అది మనకు గొప్ప కవచము. అట్టి భద్రమైన కవచము మనము ధరించి అనిత్యము అశాశ్వతమైన లౌకిక సుఖము మనము ధరించుటకు దీని భరించుకొన లేక అనేక బాధలకు గురౌతున్నాము.

విద్యార్థులారా! క్షమ చాలా ప్రధానమైన గుణము. ఎలాంటి పరిస్థితులందైనా ఓపిక మీరు పట్టండి. తొందర పాటు పడకండి. haste makes waste, waste makes worry. So do not be in a hurry. మీరు తొందరపడకండి. శాంతముగా భరించండి. శాంతముతో ఎంతైనా సాధించవచ్చు. 'శాంతము లేక సౌఖ్యము లేదు శాంతుడైనా వేదాంతునకైన. సారస దళనయనా!' శాంతము లేనిదే సౌఖ్యము లేదు. కనుక ఈ శాంతము మనం వహించాలి. ఆ శాంతమే మనకు రక్ష. తొందరపాటు పడకూడదు. ఇందులో విద్యార్థులలో ఉడుకు రక్తము ప్రవహిస్తుంది. కనుక విద్యార్థులకు క్షమ అవసరము. పరీక్షలను ఎదుర్కొనుటకు మనము ఓర్పు వహించాలి. ఇతరులు ఎన్ని దూషణలాడినా ఓపికగా తీసుకోవాలి. ఏదో అన్నారని మనము కూడా అంటే మన విలువైన క్షమను వ్యర్థము చేసుకున్నవారమవుతాము. వారి మాటలు అల్పమైనవిగా, విలువలేనివిగా ఉండవచ్చును. కానీ మన క్షమ చాలా విలువైనది. అట్టి మసిబొగ్గుకు ఈ మాణిక్యమును ధారపోయ కూడదు. క్షమ మాణిక్యము. పరులు ఎన్ని విధములైన నిందారోపణలు చేసినా ఏమాత్రము మనము జంకకూడదు.

ఈనాడు ఓపిక లేకపోవటం చేత జీవితమునే వ్యర్థముగావించుకుంటున్నాము క్షణక్షణమునకూ కోపం వస్తుంది. కోపము మహా పాపము. కాని కొంతమంది భగవత్ప్రార్థన చేస్తూ కూడా ప్రక్కనున్న వారితో కోపం చేత అనేక శబ్దములు వాడుతుంటారు. భజనలో పక్కన ఒక అమ్మ కూర్చుంది. అనుకోండి. ఆమె కొంచెం స్థలం ఇవ్వటంలేదు. కానీ చాలా కష్టంగా భరించుకుంటుంది.

అక్కడ భరించుకోవాలి మరి. కానీ పక్క వ్యక్తిపై కోపం వచ్చి భజన అంతా అయిన తరువాత శాంతి చెప్తారు శాంతి శాంతి శాంతి అని కోపమును శాంతిలో ప్రవేశపెడతారు. ఇలాంటి భక్తులు ఏమి శాంతి సాధించగలరు. ఇది నాకు ఒక పరీక్ష అని శాంతి శాంతి శాంతి అని శాంతముగా చెప్పాలి. ఓం శాంతి కూడా రౌద్రముగా బయట పెడుతున్నది. అదే భక్తిరహితమైన పాటలు. నిజముగా భక్తి అంటే ఎలాంటి పరిస్థితి యందైనా సహన భావము వహించేదారము. చిన్న చిన్న విషయములకు కూడా మనం కోపాన్ని తెప్పించుకోకూడదు. కాని కోపాన్ని తెప్పించుకుంటున్నాం. ద్వేషాన్ని పెంచుకుంటున్నాము. కలహాలాడుతున్నాం. కల్లోలము చేస్తున్నాం. సమాజములో అశాంతిని ప్రసరింప చేస్తున్నాము. కాదు కాదు. నీవు శాంతిగా ఉండు. నీ కుటుంబమును శాంతిగా పెంచుకో. సమాజమునకు శాంతినందించు అది నీ కర్తవ్యము. అట్లు కాక నీకూ శాంతి లేక, సమాజమునకు అశాంతి అందివ్వటం మహా పాపం. కనుక మనము క్షమా గుణమును అత్యవసరంగా, ప్రధానమైన ప్రాణముగా భావించి మనం అభివృద్ధి గావించుకోవాలి.